ప్రజాశక్తి

బుధవారం 18 అక్టోబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఎరువుల ధరలకు రెక్కలు

యూరియా బస్తాకు రూ.113 అదనంగా వసూలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఎరువుల ధరలకు రెక్కలు వచ్చాయి. గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పి) కంటే ఎక్కువ ధరలకు విక్రయాలు జరుగుతున్నాయి. ప్రధానంగా యూరియా బస్తా ఎంఆర్‌పి రూ.266.50 ఉండగా వ్యాపారులు రూ.380 వరకు విక్రయిస్తున్నారు. పల్నాడు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈ తతంగం ఎక్కువగా జరుగుతోంది. వర్షాభావం వల్ల పైర్లు బెట్టకు వస్తున్నాయి. ఈ ఉపద్రవం నుంచి పైర్లను కాపాడుకునేందుకు యూరియా లేదా పొటాషియం నైట్రేట్‌ను వినియోగించుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. దీంతో రైతులు యూరియా కొనుగోలుకు ఆసక్తి చూపగానే వ్యాపారులు ధరలు పెంచారు. యూరియా లేక పొటాషియం నైట్రేట్ పిచికారి చేయడం వల్ల పైరును బతికించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో గత వారం రోజుల్లో ఎరువుల వినియోగం పెంచారు. ప్రస్తుతం మిర్చి, వరికి కూడా ప్రస్తుతం యూరియా అవసరం ఏర్పడింది. ఇదే అదనుగా వ్యాపారులు ధరలను పెంచి విక్రయిస్తున్నారు.

చర్లగుడిపాడులో విజిలెన్సుఅధికారులు స్వాధీనం చేసుకున్న ఎరువులు

నిరక్ష్యరాస్యులైన రైతులకు అప్పు రూపంలో ఇచ్చే ఉత్పత్తులకు అధిక ధరలకు విక్రయించడం వ్యాపారులకు పరిపాటిగా మారింది. సేద్యానికి బ్యాంకర్లు రుణాలు ఇవ్వకపోవడం వల్ల రైతులు ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడుతున్నారు. విత్తనాలు,ఎరువులు, పురుగుమందులు వ్యాపారులు చెప్పిందే ధర, ఇచ్చిందే సరుకు అన్నట్టుగా సాగుతుంది. సాధారణ కంపెనీలకు చెందిన ఎరువులు, పురుగు మందులతోపాటు బయో ఉత్పత్తులనూ రైతులకు అంటగడుతున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాలో లక్ష ఎకరాల్లో మిర్చి సాగు అవ్వగా పైరు ఎదుగుదల దశలో ఉంది. దీంతో ఎరువుల వినియోగం అనివార్యంగా మారింది. గుంటూరు, పల్నాడు జిల్లాలో 1.65 లక్షల ఎకరాల్లో వరిపొట్ట దశలో ఉంది. వర్షాభావం నుంచి బయటపడేందుకు ఎరువుల వినియోగం కొంత వరకు అయినా కాపాడుతుందని రైతులు భావిస్తున్నారు.

గతేడాది కంటే ఈఏడాది సాగు తగ్గడం వల్ల యూరియా, డిఎపి, కాంప్లెక్స్ వినియోగం గణనీయంగా తగ్గింది. దీంతో వ్యాపారులు చాలా కొంత వరకు నష్టపోయారు. పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని అంటూ రైతుల వద్ద బస్తాకు రూ.80 నుంచి రూ.120 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. గురజాల మండలం చర్లగుడిపాడు అమరనాథ్ ట్రేడర్స్‌లో ఇటీవల విజిలెన్సు అధికారులు తనిఖీలు చేసి అధిక ధరలకు విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఎంఆర్‌పి రూ.266.50 కాగా బస్తారూ.380కు విక్రయిస్తుండగా పట్టుకుని షాపును ఎరువుల నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. బస్తాకు రూ.113.50 అదనంగా విక్రయించినట్టు గుర్తించినట్టు విజిలెన్సు ఎస్‌పి ఈశ్వరరావు తెలిపారు. ఎవరైనా ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

ఆశ వర్కర్ల మరో విజయం

- పని ఒత్తిడి, వేధింపులకు గురిచేసిన అధికారి బదిలీ
- ధర్నాను విరమించి విధులకు హాజరవుతున్నట్లు ఆశాల ప్రకటన

ప్రజాశక్తి-తాడేపల్లి

పని ఒత్తిడి పెంచి ఆశ వర్కర్ కృపమ్మ మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆశ వర్కర్లు చేస్తున్న పోరాటం ఫలించింది. జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశాల మేరకు అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌ఓ మంగళవారం ప్రకాష్‌నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌కు వచ్చారు. ఆశ వర్కర్లలో గంటన్నర పాటు చర్చించి వారి డిమాండ్ మేరకు హెచ్‌యును సీతానగరం పిహెచ్‌సికి బదిలీ చేశారు. విచారణలో నలుగురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. అడిషనల్ డిఎంహెచ్‌ఓ రత్నమనోహర్ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఇక నుంచి అధికారుల నుంచి వేధింపులు ఉండవని చెప్పారు. తాము చేస్తున్న డిమాండ్ అధికారులు సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవడంతో బుధవారం నుంచి విధులకు హాజరవుతామని ఆశాలు ప్రకటించారు. తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం సమీపంలో జరుగుతున్న ధర్నా ముగిసింది. ఈ సందర్భంగా ప్రకాష్‌నగర్ సిఐటియు కార్యాలయంలో ప్రకాష్‌నగర్ పరిధిలోని యుపిహెచ్‌సి ఆశ వర్కర్లలో సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ఐక్యంగా పోరాట

▶ 2లో

ముగ్గురు గర్భిణుల మృతిపై సమీక్ష

2 లో

ఒప్పిచర్లలో చెరువు నుండి తరలుతున్న మట్టి

చెరువులు నింపడంలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - కారంపూడి

తాగు అవసరాల కోసమని సాగర్ కుడి కాల్వ ద్వారా విడుదల చేసిన నీటిని చెరువులకు పెట్టడంలో క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. మండలంలోని ఒప్పిచర్లలో ఎర్ర చెరువు, నల్లచెరువులు ఉండగా వాటికి నీటిని పెట్టకుండా మట్టిని తవ్వుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మండల కేంద్రమైన కారంపూడిలోని చెరువులకు నీరు రావడం లేదు. పెద్దకొదమగుండ్ల మేజర్ పరిధిలో చెరువులు, కుంటలకు ఇంకా నీరు చేరలేదు. ఎండిపోయి ఉన్న నాగులేరుకు ఎస్కేప్ ఛానల్ ద్వారా కొద్ది నీరు చేరింది. వర్షాల్లేకపోవడం, ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటాయి. కొన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయి. తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విడుదలైన నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సైతం చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఈ జాగ్రత్తలు కనిపించడం లేదు.

పనులు చూపకుంటే అప్పులపాలే

- ప్రజారక్షణభేరి యాత్రలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్
- వ్యవసాయ పనుల్లేక కుటుంబాలు గడవడం కష్టమవుతోందని వాపోయిన మహిళలు
- వ్యవసాయం చేసేది తామే అయినా సాయం దక్కడం లేదన్న కౌల్దార్లు
- ఉపాధి హామీ కూలి డబ్బులు రాలేదని మరికొందరి ఆవేదన

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రజలు అప్పులపాలు కాకుండా ఉండాలంటే ఉపాధి అవకాశాలు కల్పించాలని, అధిక ధరలు తగ్గించి రేషన్ షాపుల ద్వారా బియ్యం, కందిపప్పుతో పాటు ఇతర నిత్యావసరాలనూ పంపిణీ చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి పాదయాత్ర పట్టణంలో ఐదో రోజైన మంగళవారమూ కొనసాగింది. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ చేశారు. వెంగళరెడ్డి నగర్, రఘురాం నగర్, నాగార్జున నగర్, 24వ వార్డు, సొసైటీ ఏరియా, వావిలాల నగర్లలో యాత్ర పర్యటించగా అనేక సమస్యలను ఆయా ప్రాంతాల ప్రజలు పాదయాత్ర బృందం దృష్టికి తెచ్చారు. వర్షాల్లేక వ్యవసాయం తగ్గిందని, దీంతో తమకు

▶ 2లో

సత్తెనపల్లి మండలం నందిగామ ఎస్సీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు అధికారులు, విద్యార్థులు

యూనివర్సల్ ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిజ్ఞ

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని డోకిపర్రు అడ్డ రోడ్డు వద్ద గల యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో 'మేరీ మట్టి- మేరే దేశ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మిట్టికో నమన్ వీరంకో వందన్ అనే కార్యక్రమం నిర్వహించారు. 6 వేల గ్రామాల నుండి, నెహ్రూ యువ కేంద్రం సంఘటన్, కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల ప్రకారం ఇంటింటికి వెళ్లి బియ్యం, మట్టిని సేకరించి పంచ్ ప్రాణ ప్రతిజ్ఞను చేయడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఢిల్లీలో ఉన్న కర్తవ్యపత్‌లో నిర్వహించబోయే జాతీయస్థాయి కార్యక్రమంలో దాదాపుగా 75 వేల మంది సమక్షంలో అక్టోబర్ నెల చివరి వారంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద వేల గ్రామాల నుండి సేకరించిన మట్టిని మరియు బియ్యాన్ని అక్కడ ఇస్తారని ఫేస్ ఫౌండేషన్ సెక్రటరీ పి.రమేష్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరెడ్డి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, ఎంపీడీవో ప్రభాకర్‌రావు, నెహ్రు యువ కేంద్ర డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ దేవ్‌రెడ్డి, కిరణ్మయి, పేస్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ జి.శిరీష, కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ జి.మర్రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్ షాప్ యజమానులతో మాట్లాడుతున్న పొన్నూరు వ్యవసాయ శాఖ అధికారి రామకోటేశ్వరి

పది బస్తాలకు మించి ఎరువు ఇవ్వొద్దు

ప్రజాశక్తి - కాకుమాను

మండల కేంద్రమైన కాకుమానులోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఫెర్టిలైజర్స్ షాప్ యజమానులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పొన్నూరు వ్యవసాయ శాఖ అధికారి కోటేశ్వరి మాట్లాడుతూ ప్రతి రైతుకు ఎరువులను ప్రభుత్వం సూచించిన రేటుకే ధరకే ఇవ్వాలని 10 బస్తాలు కంటే ఎక్కువ ఇవ్వకూడదని, ఇచ్చిన ప్రతి ఒక్కరి నుంచి ఆధార్ నంబర్ సేకరించి ఈ-పోస్ మిషన్‌లో వేలి ముద్ర వేయించాలని చెప్పారు. ప్రతిరోజు స్టాక్ రికార్డులు సక్రమంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలకు అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.కిరణ్మయి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల మరో విజయం

(మొదటి పేజీ తరువాయి)

స్ఫూర్తి కనబరచిన ఆశాలకు అభినందనలు తెలిపారు. సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, కె.లక్ష్మి మాట్లాడుతూ ఆశ వర్కర్ల పోరాటానికి మద్దతు తెలిపిన టిఎన్‌టియుసి, టిడిపి, ఎఐటియుసి, సిపిఎం, జనసేన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పోరాటానికి మద్దతు తెలిపిన భవన నిర్మాణ కార్మిక సంఘం, మున్సిపల్ వర్కర్స్ సంఘం ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రకాష్‌నగర్ యుపిహెచ్‌సి పరిధిలో అధ్యక్షులుగా ఎస్.విజయలక్ష్మి, కార్యదర్శిగా వేముల రేణుకతో పాటు మరో ఆరుగురితో కమిటీ ఎన్నికైంది.

పనులు చూపకుంటే అప్పులపాలే

(మొదటి పేజీ తరువాయి)

పనుల్లేకుండా పోయాయని పలువురు మహిళలు తెలిపారు. కుటుంబాలు గడవడం కష్టమవుతోందని, ఉపాధి చూపాలని కోరారు. డ్రెయినేజీ కాల్వల్లో మురుగును సరిగా తీయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని, దోమల బెడద తీవ్రంగా ఉందని వాపోయారు. వావిలాల నగర్‌లో విద్యుత్ సరఫరా లేక రెండ్రోజులుగా ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణం విస్తరిస్తున్నా అందుకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను పెంచడం లేదని అన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులే సరిగా పనిచేయడం లేదనే భావన ప్రజల్లో కలుగుతోందని చెప్పారు. కార్మికుల సంఖ్యను పెంచి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుకతోపాటు భవన నిర్మాణ సామగ్రి ధర పెరుగుదల కారణంగా నిర్మాణ రంగం మందగించి భవననిర్మాణ కార్మికులకు పని దినాలు తగ్గాయన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు నిధులను గత టిడిపి ప్రభుత్వం, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం మళ్లిస్తున్నాయని మండిపడ్డారు. ఇదిలా ఉండగా 21, 22 వార్డులో సచివాలయాన్ని పాత కబేళా స్థలానికి మార్చాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు రాజకుమార్, ఎ.వెంకటనారాయణ, ఎ.వీరబ్రహ్మం, ఎం.హరిపోతురాజు, పి.ప్రభాకర్, జి.సుసులోవ్, జి.మస్తాన్‌రావు పాల్గొన్నారు.

కౌల్దార్లకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వ్యవసాయం మేమే చేస్తున్నాం.. పంటలు మేమే పండిస్తున్నాం.. నష్టాలనూ భరిస్తున్నాం.. అయినా రైతు భరోసా మాత్రం రావడం లేదు.. అని సిపిఎం పాదయాత్ర బృందం ఎదుట పలు గ్రామాల కౌలురైతులు ఆవేదన వెలిబుచ్చారు. మండలంలోని నందిగాం, గుడిపూడి, పెద్దమక్కెన, ఫణిదం గ్రామాల్లో సిపిఎం పాదయాత్ర రెండోరోజైన మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సమస్యలను నాయకులకు స్థానికులు వివరించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతోపాటు పంట రుణాలు, రైతు భరోసా, ఇతర రాయితీలు, నష్టపరిహారాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని, ఈ ఆవేదన కౌల్దార్లలో తీవ్రంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ సరిగా లేకపోవడంతో మరుగు నీరు చేరుతోందని, దోమలు పెరిగి డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలుతున్నాయని అన్నారు. ఆయా కాలనీల్లో సత్వరమే సిసి రోడ్లు నిర్మించాలని కోరారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించని కారణంగా ఇళ్ల నిర్మాణం కష్టతరమైందని, మరోవైపు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం సరిపడగా అనేక ఇళ్లు బేస్‌మెంట్ దశలోనే ఆగిపోతున్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఒక్కో ఇంటికి రూ.6 లక్షల సాయం అందిస్తేనే ఇళ్లు పూర్తవుతాయన్నారు. కాలనీలకు రోడ్లు, విద్యుత్, నీటి సదుపాయం కల్పించాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ మాట్లాడుతూ సమస్యల నిలయాలుగా గ్రామాలున్నాయని, నందిగంలో వాగు నీరు వెళ్లకపోవడం వల్ల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులకు పలుమార్లు విన్నవించినా పరిష్కరించలేదని విమర్శించారు. గుడిపూడి ఎస్టీ కాలనీలో సిసి రోడ్లు లేక మురుగు నీరంతా రహదార్లపైకి చేరి కాల్వలను తలపిస్తోందని చెప్పారు. స్థానికులు తీవ్ర తాగునీటి సమస్యను, రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. నీటి సమస్యను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఆందోళనబాట పట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. నాయకులు టి.పెద్దిరాజు, వి.తులసిరామ్, ఆర్.పూర్ణచంద్రరావు, బి.శివయ్య, కె.సాయికుమార్, డి.అమూల్య, వెంకటేశ్వర్లు, అనుష, సుజాత, సత్యవతి, గణేష్ పాల్గొన్నారు.

ముప్పాళ్ల మండలం పోరుయాత్రలో మాట్లాడుతున్న ఏపూరి గోపాలరావు

ఉపాధి హామీ కూలి డబ్బులింకా రాలేదు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలో సిపిఎం చేపట్టిన పోరుయాత్ర మూడో రోజుకు చేరింది. రుద్రవరం, తొండపి, బొల్లవరం, దమ్మాలపాడు గ్రామాల్లో మంగళవారం యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తెచ్చారు. ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు ఇప్పటికీ కూలి డబ్బులు రాలేదని, స్థానికంగా పనుల్లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నామని పలువురు కూలీలు వాపోయారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శిశర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, మండల కార్యదర్శి జి.బాలకృష్ణ మాట్లాడుతూ సాగర్ ఆయకట్టులో సాగునీటిని విడుదల లేకపోవడంతో పొలాలు సాగవ్వలేదని, దీంతో కూలీలకు పనులు తగ్గాయని చెప్పారు. ఈ నేపథ్యంలో మండలాన్ని కరువు మండలంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కూలీలకు సొంతూళ్లలోనే పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.జాలయ్య, కె.సాంబశివరావు, ఎం.వెంకటరెడ్డి, కె.నాగేశ్వరరావు, పి.సైదాఖాన్, సిహెచ్.నాగమల్లేశ్వరరావు, ఐ.సత్యనారాయణరెడ్డి, వెంకటరెడ్డి, టి.బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగ్గురు గర్భిణుల మృతిపై సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మాతృ మరణాలపై జిల్లాస్థాయి సమీక్షను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఒ) డాక్టర్ బి.రవి ఆన్‌లైన్ ద్వారా మంగళవారం నిర్వహించారు. చంద్రాజుపాలెం, నాదెండ్ల, యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సంభవించిన 3 మాతృమరణాలపై సమీక్షించారు. సంబంధిత వైద్యాధికారులు, కాన్పులు చేసిన ప్రైవేటు వైద్యశాల గైనకాలజిస్ట్, మత్తు వైద్యులు, చిన్నపిల్లల వైద్యులను విచారణ చేసి మరణాలకు దారితీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో పునరావృతం కానివ్వొద్దని హెచ్చరించారు. గర్భిణులు పోషకాహారం తీసుకునేలా, తగిన సమయానికి అన్ని పరీక్షలూ చేయించుకునేలా ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ బి.రంగారావు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ జి.చంద్రశేఖర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, డాక్టర్ నాగపద్మజ, డాక్టర్ మంత్రు నాయక్, డాక్టర్ వసంతరాయ, డాక్టర్ సింధూజ, డాక్టర్ దయానిధి, డాక్టర్ జయంతి, జిజిహెచ్ హెచ్ఒడి అరుణ, ఐసిడిఎస్ పీడీ బి.అరుణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ బి.రవి

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - చేబ్రోలు : శలపాడులో కరెంట్ షార్ట్ సర్క్యూట్ వలన ఇల్లు దగ్ధమైన ఘటనలో బాధిత కుటుంబాన్ని తహశీల్దార్ కెవి.గోపాలకృష్ణ మంగళవారం పరామర్శించారు. బాధితురాలు నాగమణితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సర్పంచి తండ్రి మన్నెం వేణుగోపలరావు తమ సొంత డబ్బులు రూ.5 వేలు, కారుమూరి యశోద ఆనందరావు చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ కారుమూరి రాజేంద్రప్రసాద్ బియ్యం, ఇతర సరుకులు, కూరగాయలు తక్షణ ఆర్థిక సాయంగా అందించారు.

అదనపు లోడు బిల్లులు చేలించాలి

ప్రజాశక్తి - కాకుమాను : విద్యుత్ వినియోగదారులు వాడుతున్న విద్యుత్ వినియోగానికి మీటర్లో ప్రస్తుతం ఉన్న లోడుకు, వచ్చే వ్యత్యాసానికి అదనపు లోడుగా పరిగణించాలని విద్యుత్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సాయి శ్రీనివాస్ సూచించారు. ఇలాంటి వారు గ్రామ సచివాలయలో వాలంటరీగా అడిషనల్ లోడ్‌కు సంబంధించిన మొత్తాన్ని (సెక్యూరిటీ డిపాజిట్) పెనాల్టీ లేకుండా 15 రోజుల్లోగా చెల్లించాలని కోరారు.

ఎస్పీకి సత్కారం

ప్రజాశక్తి - గుంటూరు సిటి : నగరంలోని సోమవారం ఫకీర్ గూడెం 24 గంటల వాటర్ పైపులైన్ కు చెందిన నాలుగేళ్ల పటాన్ షాహిద్ అలీ ఖాన్ అపహరణ కేసులో బాలుడిని రక్షించేందుకు కృషిచేసి పోలీస్ యంత్రాంగాన్ని ముందుండి నడిపిన జిల్లా ఎస్పి ఆరిఫ్ ఆఫీజ్‌ను నారీ సమాన్ చైల్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ సలీమా, మెంబర్ ఫైరోజ్ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ బాల సుందరరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పాదయాత్ర

ప్రజాశక్తి - మేడికొండూరు : నియోజకవర్గంలో జరుగుతున్న మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర ర్యాలీ మంగళవారం మండలంలోని కొర్రపాడు, సిరిపురం గ్రామాల్లో సాగింది. నాయకులు పి.రాజారావు మాదిగ, రాంబాబు మాదిగ, జోజి మాదిగ, పాల్గొన్నారు.

ఎస్ఇబి ఆధ్వర్యంలో సదస్సు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :మంగళగిరి మండలం నవులూరు గ్రామ పరిదిలోని ఎస్ఈబి కార్యాలయంలో మంగళవారం విధ్యార్థుల వసతి గృహ నిర్వాహకులతో గంజాయి నిర్మూలన సదస్సు ఎస్ఈబి జేడి డిఎస్ మహేష్, సిఐ మారయ్య బాబుల ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు గంజాయి వలన కలిగే నష్టాలు, భవిష్యత్తు గురించి తెలియ జేశారు. ఏవరైతే నిర్వాహకులు ఉన్నారో వాటికి సంబం ధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధ్యార్థులు ఎలా ఉండా లో ఎలాంటివి హాస్టల్స్ లో తీసుకుని వచ్చిన వాటిపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసేలా తగు జాగ్రత్తలు జేడి మహేష్ వసతి గృహ నిర్వాహకులకు తెలిపారు. వీటితో పాటు మాదక ద్రవ్యాల వలన కలిగే ఇబ్బందుల గురించి వివరించారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ

ప్రజాశక్తి - గుంటూరు సిటి

నగరంలోని వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పెండింగ్ ట్రాఫిక్ కేసుల రికార్డులను పరిశీలించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని, అధికారులను ఆదేశించారు .రోడ్ ప్రమాదాల నివారణ కోసం డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహించాలని, మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపాలని ట్రాఫిక్ అధికారులకు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాళ్లకు మోటర్ వెహికల్స్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డి ఎస్ పి బాల సుందర రావు స్పెషల్ బ్రాంచ్ సి ఐ బాల సుబ్రమణ్యం , సి సి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - తెనాలి

హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు, రూ. 1000 జరిమానా విధిస్తూ 11వ అదనపు జిల్లా జడ్జి జి.మాలతి మంగళవారం తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2019 మే 14న దుగ్గిరాల మండలం చిలువూరు కు చెందిన పూర్ణ శేఖర్ దుగ్గిరాల లోని ఓ మద్యం దుకాణం వద్ద మద్యం సేవిస్తున్నాడు. అదే సమయంలో అతని సమీప బంధువైన నరేష్ బాబు వచ్చి తనకు కూడా మద్యం ఇప్పించాలని పూర్ణ శేఖర్‌ను కోరాడు. అందుకు అతను నిరాకరించడంతో అతనితో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో నరేష్ బాబు బీరు సీసాతో పూర్ణ శేకర్ గొంతులో పొడిచాడు. పూర్ణ శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. దుగ్గిరాల పోలీసులు కేసు నమోదు చేయగా, అప్పటి తెనాలి రూరల్ సీఐ సుధాకర్ రావు ఆధ్వర్యంలో విచారణ జరిగింది. కేసులో వాదోపవాదాలు పూర్తయిన పిదప నరేష్ బాబుకు జీవిత ఖైదు, రూ. 1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వెయ్యి రూపాయలు చెల్లించలేని పక్షంలో మరో ఆరు నెలలు అదనంగా జైలు శిరీష అనుభవించాలని ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ దాట్ల మోహన్ రెడ్డి వాదించారు.

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని తుమ్మపూడి గ్రామంలో నాలుగు సంవత్సరాల క్రితం పద్మావతి వైన్స్ లో జరిగిన హత్య కేసులో ముద్దాయికి జీవిత కారాగార శిక్ష విధిస్తూ జడ్జి మంగళవారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుమ్మపూడి గ్రామంలోని పద్మావతి వైన్స్‌లో మద్యం సేవించిన చిలువూరు గ్రామానికి చెందిన స న్నే కంటి నరేష్ అదే గ్రామానికి చెందిన కాబోతు పూర్ణ శేఖర్‌ను మద్యం సీసా పగలగొట్టి గొంతులో పొడిచాడు. శేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా నేరస్తుడిని స్థానికులు పట్టుకొని కట్టివేసి పోలీసులకు అప్పగించారు. మృతుడి సోదరుడు విజయ్ శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్చార్జి సిఐ సుధాకర్ ఆధ్వర్యంలో దుగ్గిరాల ఎస్సై అనిల్ కుమార్ రెడ్డి కేసు నమోదు చేశారు. తెనాలి 11వ జడ్జ్ మాలతి నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు . పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహన్ రెడ్డి కేసును వాదించారు.

నిరసన ఫలితంగా సాగునీరు సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి - చేబ్రోలు

సుద్ధపల్లి గ్రామంలో వరి పైరులు ఎండిపోతున్న ఆవేదనతో ఉన్న రైతులతో కలిసి చేసిన నిరసన ఫలితంగా పంట పొలాలకు నీరెళ్ళేందుకు కాలువలు గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభించడం జరిగిందని పొన్నూరు మాజీ శాసనసభ్యులు ధూళిపాల నరేంద్ర కుమార్ అన్నారు. అధిక పెట్టుబడులు పెట్టి నీరు లేక ఎండిపోతున్న వరి పంటలు పండే సుద్దపల్లి పొలాలను చూసి తల్లడిల్లి పోతున్న రైతుల బాధలను చూడలేక చలించి రైతులతో కలిసి ఎస్ ఈ ఇరిగేషన్ గుంటూరు కార్యాలయాన్ని ముట్టడి చేసి నిరసన తెలపడం అందరికీ తెలిసే తెలిసిన విషయమేనన్నారు. ఎస్ ఈ ఇరిగేషన్ గుంటూరు కార్యాలయం ముట్టడి చేసి తగిన ఏర్పాట్లు చేసి రైతులకు వెంటనే నీరు అందించకపోతే రైతులతో కలిసి మరింత పోరాటం చేస్తానని హెచ్చరించడం జరిగిందన్నారు. ఫలితంగా అధికారులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించామని, స్పందించిన ప్రభుత్వం, సంబంధిత అధికారులు సోమవారం రాత్రి మరియు మంగళవారం నీటిని సరఫరా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటూ మరమ్మతులు చేస్తున్నారు అన్నారు. గత నెలరోజుల నుండి సాగునీరు లేక రైతులంతా ఎంతో ప్రయాసలతో, తిని తినక వేసిన పైర్లు కళ్ళముందే ఎండి పోతుంటే నీటి వసతి కల్పించడానికి స్థానిక శాసనసభ్యులు ఎటువంటి ప్రయత్నము చేయడం లేదు రైతులు వాపోతున్నారని అన్నారు. అధికారంలో లేనప్పటికీ రైతుల బాధలు తెలిసిన నరేంద్ర కుమార్ ఇరిగేషన్ అధికారులతో పోట్లాడి నీరు వచ్చే విధంగా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని రైతులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి రైతు మృతి

ప్రజాశక్తి - రొంపిచర్ల

వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో అన్నవరం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తిరువీధుల లింగారావు (45) వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలానికి ట్రాక్టర్ నడుపుతూ వెళ్ళుతున్నారు. వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ పొలం సమీపంలోకి రాగానే అదుపుతప్పి రోడ్డు ప్రక్కన గల పంట కాలువలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ సంఘటనలో ట్రాక్టర్ అతనిపై పడటంతో తీవ్ర గాయాలు అయ్యి, ఊపిరిరాడక లింగారావు (45) అక్కడికక్కడే మృతి చెందారు. కాలువలో బోల్తా పడిన ట్రాక్టర్‌ను ప్రొక్లెయినర్ సహాయంతో బయటకు తీశారు. మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - నకరికల్లు

కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం త్రిపురపురం గ్రామ శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను, రెండు పందెం కోళ్లను, రూ.4630 నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని విజయవాడ- గుంటూరు సర్వీసు రోడ్డు ఎఎన్‌యు లేడీస్ హాస్టల్ గేటు వద్ద సుమారు 60-70 సంవత్సరాల వృద్ధుని మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. నంబూరు సచివాలయం- 4 మహిళ కానిస్టేబుల్ జొన్నలగడ్డ రాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

విద్యుత్ కార్మికుడికి తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని మెల్లంపూడి గ్రామ పరిధిలో మంగళవారం విద్యుత్ లైన్లు మరమ్మతులు చేసే క్రమంలో విద్యుత్ కార్మికుడికి ప్రాణాపాయం తప్పింది. విద్యుత్ పోల్ పై నుండి ఇద్దరు విద్యుత్ కార్మికులు పనిచేస్తుండగా, ఒక్కసారిగా ఒక కార్మికుడు తీగలపై వాలాడు. ఇది గమనించిన తోటి కార్మికుడు గట్టిగా కేకలు వేయడం ఃతో, స్తంభం క్రింద వున్న మిగతా వర్కర్స్ అప్రమత్తం అయ్యారు. తాళ్ల సహాయంతో తీగలపై వ్యక్తిని క్రిందకి దించారు. వెంటనే ,తాడేపల్లిలో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రాణాపాయ స్థితి నుండి బయటపడినట్లు వైద్యాధికారులు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఊడిజెర్ల గ్రామ సమీపంలో నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువలో ఈత కోసం వెళ్లి గల్లంతైన ఆంధ్ర ప్రవీణ్ (25) ఆచూకీ మంగళవారం లభ్యం కాలేదు. బంధువులు, స్థానికులు కాలువ వెంబడి గాలింపు చేపట్టినప్పటికీ మతుని ఆచూకీ లభించకపోవడంతో స్థానిక తహసిల్దార్ అచ్యుత వెంకట సుధాకర్ ఏపీ ఎస్డిఆర్ఎఫ్ రెస్క్యూ బృందం వారికి సమాచారం అందించారు. రెస్క్యూ బృందం కాలువ వద్దకు చేరుకొని బోటు సాయంతో ప్రవీణ్ గల్లంతయిన ప్రదేశం నుండి సుమారు ఆరు కిలోమీటర్ల మేర గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్, తహసిల్దార్ అచ్యుత వెంకట సుధాకర్ గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మేడికొండూరు

రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఇరువురి వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి.ఈ సంఘటన మండల కేంద్రమైన మేడికొండూరులో మంగళవారం సాయంత్రం జరిగింది. బీహార్‌కు చెందిన ఇద్దరు యువకులు దినేష్, నఫీస్ ఖాన్‌లు ద్విచక్ర వాహనంపై సత్తనపల్లి నుండి పేరేచర్ల వైపు వెళుతున్నారు. మార్గ మధ్యలో మండల కేంద్రంలో మేడికొండూరు జిల్లా పరిషత్ హై స్కూల్ సమీపంలో బ్రిడ్జీ వద్ద వెనక నుంచి అధిగమించబోయిన లారీ బలంగా ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం పడిపోయింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు. వీరి వివరాలు తెలియ రాలేదు. మేడికొండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు డయిల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :తెనాలి ఆర్టిసి డిపోలో అక్టోబర్ 18న నిర్వహించే డయిల్ యువర్ డిఎం ను సద్వినియోగపరచుకోవలాని డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురు వారం ఉదయం 10:30 గంటల నుండి 11:30 వరకు నిర్వహించే కార్యక్రమంలో తెనాలి పరిసర ప్రాంత ప్రజలు, ప్రయాణికులు పాల్గొని ఈ ఫోన్ నంబర్ ద్వారా 9959225422 తమ సందేహాలను నివృతి చేసుకోవాలన్నారు.

మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో..
O.S. No. 38/2021

షేక్ జిలాని ....వాది
మరియు
1.షేక్ హుస్సేన్ & వగైరాలు. .... ప్రతివాదులు

To,
D4) షేక్ ఆరిఫా W/o సికిందర్ భాషా,
D.No: 5-87, తాడికొండ గ్రామం,
తాడికొండ మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబర్ ఐపి దావాలో వాది మీ పైన డిక్లరేషన్ దావా దాఖలు చేసి సదరు దావాలో శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం ఎన్ని సార్లు మీకు దావా నోటీసులు మరియు ఇంజెక్షన్ పిటిషన్ నోటీసులు పంపినను మీరు దావా విషయం తెలిసి కూడా నోటీసులు తీసుకోనందున ఈ పేపర్ ప్రకటన ద్వారా పై కోర్టు వారి ఎదుట ది. 20-10-2023 న ఉదయం 10:30 ని.లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ న్యాయవాది గారి ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో..
వాయిదా తేది. 20-10-2023.

ఎ.అజయ్ బాబు,
పిటిషనర్ తరపు న్యాయవాది,
వినుకొండ, పల్నాడు జిల్లా.

మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో..
క్రెడిటార్ ఐ.పి నెం. 50/2022.

బిట్వీన్:-
యలగాల అంజయ్య.. ...పిటిషనర్.
మరియు
చిట్టిబోయిన పూర్ణయ్య మరియు ఇతరులు
...రెస్పాండెంట్స్

To,
R23) దొడ్డ కృష్ణ మూర్తి S/o కోటి సుబ్బయ్య
D.No:3-32, పసుమర్రు గ్రామం, చిలకలూరిపేట మండలం, పల్నాడు జిల్లా.
R30) గ్రంథి సుబ్బయ్య S/o కోటయ్య D.No: 2-35, గోపాళంవారిపాలెం గ్రామం, చిలకలూరిపేట మండలం, పల్నాడు జిల్లా.

సదరు పై నెం. పిటీషన్ లో ఇందలి రెస్పాండెంట్స్ మీద ఐ.పి దావా దాఖలు చేసియున్నారు. సదరుపై నెం. ఐ.పిలో R23 అయిన దొడ్డ కృష్ణమూర్తి మరియు R30 అయిన గ్రంథి సుబ్బయ్యగార్లకు శ్రీ కోర్టువారి ద్వారా మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను ఈ పిటిషన్ వ్యవహారం తెలిసి కూడా నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టువారు ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ నోటీసు నిమిత్తం ది. 3-11-2023 కు వాయిదా వేసి ఉన్నారు. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 ని.లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ న్యాయవాది గారి ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.

శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో..
వాయిదా తేది. 3-11-2023.

శ్రీగిరిరాజు నాగేశ్వరరావు,
పిటిషనర్ తరపు న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.
సెల్:9441061261.

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT
AT :: HYDERABAD
O.S.NO. 4343 OF 2022

BETWEEN:-
Dharavath Venkata Sukruth,
...Plaintiff
AND
M/S. Greenland Beverages and another
...Defendants

 # BY THE WAY OF ORDER V RULE 20 OF CPC #

To, M/S. Greenland Beverages, Rep by. Smt. B. Venkata Ratnam R/o Door No.26- 34-9/A9 th Line at Agraharam, Guntur District, Guntur, Andhra Pradesh- 522003
(Defendant No.2)

Respected Sir, Whereas the Plaintiff herein has instituted a suit against yourself for Recovery of Rs.6,00,047/- with interest. Whereas it has been proved to the satisfaction of the Hon'ble Court that Defendant No.2 i.e., the above named cannot be served summons in an ordinary way of service, as such, this proclamation under Order V Rule 20 of CPC is issued on 6-09-2023 by the Hon'ble Court against the above and should appear either in person or through an Advocate on 01-11-2023 at 10:30 AM. Take notice that in default of your appearance on the day before mentioned, the above said suit will be heard and determined in your absence. Hence this notice.

M/s Dr. Sireesh Anumula
Mavoori Arvind Kumar
Savitesh Aatmasvi Anumula
Advocates
Chambers: 8-2-595-3/9, Building No.2, Eden Gardens, Road No-1, Banjarahills, Hyderabad-34 9866166786, 8227869786

ఒరిజినల్ షేర్‌బాండ్ పోయినది

గుంటూరు నగర వాస్తవ్యులు అయినా గల్లా హనుమంతరావు తండ్రి వెంకటసుబ్బయ్య గారికి చెందిన GHCL (గుజరాత్ హెవీ కెమికల్ లిమిటెడ్) కంపెనీకి చెందిన 200 షేర్లు కలిగిన ఒరిజినల్ బాండ్ నెంబర్:**0000355** గుంటూరు కొరటిపాడు గాంధీ బొమ్మ సెంటర్‌లో గల ఇంటి దగ్గర నుంచి అరండల్ పేటకు బండిమీద వెళుతుండగా మార్గంమధ్యలో ఒరిజినల్ షేర్ బాండ్ ఉన్న సంచి జారిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. దొరికిన వారు ఈ కింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

గల్లా హనుమంతరావు
లేట్ తండ్రి వెంకటసుబ్బయ్య,
డోర్ నెంబర్:4-7-12,
నియర్ గాంధీ బొమ్మ సెంటర్,
కొరటిపాడు, గుంటూరు.
సెల్ : 7093458904

ప్రకటన
మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు,చీరాల, బాపట్ల జిల్లా
CC.NO. 231/2001

శ్రీ కోర్టు వారు ఈ క్రింది పేర్కొన్న వ్యక్తి పై **CR.PC.Sec.82 మరియు 83** ప్రకారం నోటీసులు అనగా ప్రొక్లమేషన్ ఆర్డర్ ఇవ్వడం జరిగినది. అందువలన వారి యొక్క ఆస్తులు ఏమైనా ఉన్న యెడల జప్తు చేయబడతాయి. ఇందు మూలముగా ఎలాంటి అభ్యంతరమైనా ఉన్న యెడల శ్రీ కోర్టు వారికి విన్నవించు కోవలసినదిగా మనవి.

ఎం.శ్రీనివాస్
ప్రొప్రైటర్ ఆఫ్ M/s సన్ రైజ్ ఫార్మా,
D.No : 11-4-131,
భాస్కర్ కాంప్లెక్స్
4th లైన్, రాజాజీ గార్డెన్స్, గుంటూరు

BY ORDER.
Drugs inspector
Bapatla

మేకలకు మేతగా పత్తి పొలాలు!

- రెండుసార్లు విత్తినా దక్కని ఫలితం
- వర్షాలు పడక, నీరు రాక బెట్టకొస్తున్న పైరు
- చుట్టుముట్టిన తెగుళ్లతో రైతుల్లో కంగారు
- వేలకువేలు పెట్టుబడులు పెట్టి నష్టాల బాట

రొంపిచర్ల మండలం నల్లగార్లపాడులో దెబ్బతిన్న పత్తిపొలం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

తెల్ల బంగారాన్ని ఇస్తుందనుకున్న పైరు చివరికి మేకలు, గొర్రెలకు మేతగా మారుతోంది. పల్నాడు జిల్లాలో గడిచిన దశాబ్ద కాలంగా పత్తి పంట సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. ఒకప్పుడు 3 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. అయితే తీవ్ర వర్షాభావం, గులాబీ రంగు పురుగు ఉధృతి నేపథ్యంలో ఈ ఏడాది 1.25 లక్షల ఎకరాల్లోనే రైతులు సాగు చేశారు. వినుకొండ, మాచర్ల, చిలకలూరిపేట, ప్రాంతాల్లో పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండగా మిగిలిన నియోజకవర్గాల్లో ఒక మోస్తరుగా ఉంది. రైతుల ఆందోళనకు తగ్గట్టుగానే పత్తి పైరును సమస్యలు చుట్టుముట్టాయి. ఒకవైపు గులాబీ రంగు పురుగు మరోవైపు ఎర్ర తెగులు రసం పీల్చు పురుగులు విస్తృతంగా వ్యాపించడంతో పైరు ఎదుగుదల తగ్గింది. నాలుగు అడుగులకు పైగా ఎత్తు పెరగాల్సిన మొక్కలు రెండడుగుల లోపే ఉన్నాయి. ఇది దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులంటున్నారు. ఇదిలా ఉండగా వర్షాల్లేక పైరు బెట్టకొస్తోంది. చాలాచోట్ల పూత కూడా సరిగా రావడం లేదు. ఇది కూడా దిగుబడిని దెబ్బతీస్తుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

సాధారణంగా వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 4-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అయితే గత ఐదేళ్లుగా రెండు మూడు క్వింటాళ్లకు మించి రావడం లేదు. ఈ ఏడాది జూన్‌లో వర్షాలు ఆలస్యమవగా జూన్‌లో కొంతమేరకు కురిశాయి. ఆగస్టులో అసలు లేవు. దీంతో ఎండిపోయిన మొక్కలను పీకేసిన రైతులు మళ్లీ విత్తనాలు కొనుగోలు చేసి మరోసారి విత్తారు. ప్రస్తుతం పత్తికి రసం పీల్చే పురుగు ఉధృతంగా వ్యాపిస్తున్న పరిస్థితుల్లో రైతులకు అందుబాటులో వ్యవసాయాధికారులు ఉంటూ నష్ట నివారణ చర్యలు చేపట్టాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. మరోవైపు ఇప్పటికే రూ.15 వేలకుపైగా పెట్టుబడి పెట్టి సాగు చేసిన పైరు బెట్టకు రావడంతో ఇక లాభం లేదని భావించిన రైతులు ఆ పొలాలను జీవాలు మేపుకోవడానికి రూ.500-1000కి ఇచ్చేస్తున్నారు.

గులాబీ రంగు పురుగు నివారణ ఇలా..

గులాబీ రంగు పురుగు ఉధృతి గుర్తించడానికి ఎకరాకు 4 లింగాకర్షణ బుట్టలు పొలంలో అమర్చుకోవాలి. ఎక్కువ సంఖ్యలో పురుగు ఉంటే 10-20 బుట్టల వరకు పెట్టుకోవాలి. వీటిల్లో వరుసగా 3 రోజుల పాటు 8 చొప్పున పురుగులు పడితే పంటకు తీవ్రమైన నష్టం కలుగుతుందని అంచనా వేయాలి.

పైరు 40-50 రోజుల దశలో పురుగు లార్వా నివారణకు వేపనునే పిచికారీ చెయ్యాలి. 1000 పిపిఎం వేపనూనె అయితే ఎకరాకు 500 మిల్లీ లీటర్లు, 1500 నుండి 3000 పిపిఎం వేప నూనె అయితే ఎకరాకు 1 లీటర్ చొప్పున పిచికారి చేసుకోవాలి. 50-80 రోజుల దశలోని పైరులో గులాబీ రంగు పురుగు ఉధృతంగా ఉంటే 400 మిల్లీ లీటర్ల క్వినాల్ ఫాస్ 25 ఇసి, లేదా 400 మిల్లీ లీటర్ల ప్రొఫినోఫాస్ 50 ఇసి లేదా 500 మిల్లీ లీటర్ల క్లోరిపైఫాస్ 20 ఇసి, లేదా 250 మిల్లీ లీటర్ల పిరిడాలిల్ మందులను 200 లీటర్ల నీటికి కలుపుకొని ఎకరాకు పిచికారి చెయ్యాలి. 80 రోజుల నుండి ఆఖరి దశలో ఒకటి రెండు సార్లు మాత్రమే సింథటిక్ పైరిత్రాయిడ్ మందులైన సైపర్మెత్రిన్ 25 ఇసి, 200 మిల్లీలీటర్లు లేదా లాంబ్డాసైహాలోత్రిన్ 5 ఇసి, 200 మిల్లీ లీటర్లు లేదా 320 మిల్లీ లీటర్ల చొప్పున 200 లీటర్ల నీటికి కలుపుకొని ఎకరాకు పిచికారీ చేయాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

గులాబీ రంగు పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. పైరు పూత, పిందె, కాయ దశల్లో ఉన్న నేపథ్యంలో ఇప్పటికే గులాబీ రంగు పురుగు ఆశించిందన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఉన్నందున తగిన యాజమాన్య చర్యలను వ్యవసాయాధికారులు, సిబ్బంది నుండి రైతులు తెలుసుకుని వాటిని పాటించాలి.

ఐ.మురళి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి.

వాతావరణ బీమాను వర్తింపజేయాలి

పత్తి రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. సాగుదారుల్లో సగానికిపైగా కౌల్దార్లే ఉన్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడులు పెట్టారు. కౌలు రైతులు అదనంగా మరో రూ.10 వేలు కౌలు చెల్లించారు. తీవ్రమైన వర్షాభావం నేపథ్యంలో బెట్ట పరిస్థితులు ఏర్పడి పూత, పిందె రాలి పోతున్నాయి. దీనికి తోడు గులాబీ రంగు పురుగు, తెగుళ్ల బెడదతో రైతులు నష్టాల్లో కూరుకుపోయారు. బెట్ట పరిస్థితుల మధ్య ఏ విత్తనాలు మంచివో? ఏవి నకిలీవో తెలుసుకునే అవకాశం ఉండడం లేదు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

కె.రామారావు, కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు.

ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికులకు ఐదు నెలలుగా అందని వేతనాలు

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న తమకు ఐదు నెలలుగా వేతనాలు రాలేదని, కుటుంబ పోషణ, ఇతర అవసరాలు తీర్చుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. పనికి తగ్గ వేతనం ఇవ్వకపోగా ఇచ్చే కొద్దిపాటి వేతనాలనూ సమయానికి జీతం ఇవ్వకపోవడంతో అవస్థలు పడుతున్నామని అంటున్నారు. రెక్కాడితే డొక్కడినే తమ కుటుంబాలు నెలలతరబడి వేతనాలు రాకపోవడంతో

బతుకు బండి నడవడం కష్టంగా ఉందంటున్నారు. ఫస్ట్ ఆఫ్ ది ప్రైవేట్ లిమిటెడ్ పరిధిలో తాము 9 మందిమి పనిచేస్తున్నామని, జీతాలు అడుగుతుంటే ఎప్పటికప్పుడు అదిగో.. ఇదిగో.. అంటూ కాలయాపన చేస్తున్నారని వాపోతున్నారు. ఈ సమస్య జిల్లావ్యాప్తంగా ఉందని, ఉన్నతాధికారులు కలుగజేసుకుని సమస్యను తీర్చాలని కార్మికులు కోరుతున్నారు. ఇప్పటికే నిత్యాసరాల ధరలు పెరిగి కుటుంబ ఖర్చులు ఎక్కువయ్యాయని, నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో నిత్యం అప్పులు చేయాల్సి వస్తోందని, ఇప్పుడు అప్పులు కూడా పుట్టడం లేదని కార్మికులు చెబుతున్నారు.

108 వాహనంలో తనిఖీ

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలోని 108 వాహనాన్ని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ పి.అజయ్ మంగళవారం తనిఖీ చేశారు. వాహనంలోని మందులను, పరికరాలను, రికార్డులను పరిశీలించారు. పరికరాల పనితీరును గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 108 వాహన సిబ్బంది, పైలెట్ సునీల్ పలు విషయాలను వివరించారు.

వెలకట్టలేనివి జాన్‌డేవిడ్ సేవలు

జయంతి సందర్భంగా ఘన నివాళులు - విగ్రహానికి పూలమాలలు

విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహంతి, బర్నబాస్ తదితరులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సమాజంలోని వివిధ వర్గాలకు డాక్టర్ జాన్‌డేవిడ్ అందించిన సేవలు వెలకట్టలేనివని ఎఎంజి సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి అన్నారు. ఎఎంజీ, ఫార్ కార్నర్స్, వేద సంస్థల ఆధ్వర్యంలో జాన్‌డేవిడ్ జయంతిని స్థానిక ఎఎంజిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాన్‌డేవిడ్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి అరుణ్ కుమార్ కంటి మహంతి, డాక్టర్ జెస్సియస్ బర్నాబాస్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎఎంజి సంస్థ ప్రాంగణంలో జరిగిన సభలో అరుణ్ కుమార్ కంటి మహంతి మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా పేద విద్యార్థులకు విద్యా సౌకర్యాలు కల్పించిన జాన్‌డేవిడ్ చిరస్మరణీయులన్నారు. పట్టణ ప్రజలకు తాగునీటిని అందించడంలో ఆయన ప్రధాన పాత్ర వహించారన్నారు. ఆయన సామాజిక సేవలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఫార్ కార్నర్ డైరెక్టర్ డాక్టర్ జెస్సియస్ బర్నాబాస్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారికి సాయం చేయాలని దేవుడు చూపిన మార్గాన్ని జాన్‌డేవిడ్ అనుసరించారని చెప్పారు. ఎఎంజీ తో పాటు పలు సంస్థలను స్థాపించి లక్షలాది మందికి సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సిఎఒ మాసిలామని, కార్మెల్ గాస్పల్ మినిస్ట్రీస్‌కు చెందిన కె.పరిశుద్ధరావు, ఎఎంజి బోర్డు సభ్యులు సాంబయ్య, మోజస్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ ఎం.శేషిరెడ్డి

ఓటరు జాబితాలో మార్పులు పారదర్శకంగా ఉండాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపులు పారదర్శకంగా ఉండాలని ఆర్‌డిఒ ఎం.శేషిరెడ్డి అన్నారు. ఎఇఆర్ఒలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నరసరావుపేటలోని ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. మరణించిన వారి ఓట్లు తొలగింపులు, కొత్త ఓట్ల చేర్పులు, అడ్రస్ మార్పులు అంశాలు గురించి వివరించి చర్చించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, రొంపిచర్ల, నరసరావుపేట తహశీల్దార్లు పాల్గొన్నారు.

కృష్ణా పశ్చిమ డెల్టాకు సాగు నీటిని వెంటనే విడుదల చేయాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి -మంగళగిరి : కృష్ణా పశ్చిమ డెల్టాకు సరిపడా సాగు నీటిని వెంటనే విడుదల చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి మంగళగిరి సిపిఎం కార్యాలయంలో విస్తృత సమావేశం సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. రామారావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ పశ్చిమ డెల్టా ప్రాంతంలో ఐదు లక్షల 75 వేల ఎకరాలు భూమి సాగులో ఉందని తెలిపారు. వరి పంట పొట్టకు వచ్చే సమయంలో నీరు లేక భూమి పగుళ్లు ఇచ్చిందని అన్నారు. సుదూర ప్రాంతాల నుండి పైపుల ద్వారా ఇంజన్లతో నీళ్లు పెట్టుకొని పంటల తడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇంకా వారం రోజులు నీళ్లు రాకపోతే పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురిస్తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో ఐదు మండలాల్లో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. పెదవడ్లపూడి హై లెవెల్ ఛానల్ ను పూర్తి చేసి పంటలను కాపాడాలని కోరారు. ఇప్పటికే మాగాణికి ఎకరానికి రూ. 40 వేలు ఖర్చు పెట్టారని తెలిపారు. ఇంజన్లతో నీళ్లు పెట్టడానికి ఎకరానికి రూ.5000 ఖర్చు చేయాల్సి వస్తుందని అన్నారు. కౌలు రైతులు సమస్యలు ఇంకా దారుణంగా ఉన్నాయని అన్నారు. నీటి సమస్య పరిష్కారానికి రైతులు రోడ్డు మీద కు వచ్చి ఆందోళన చేయాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలకు వెంటనే ఇళ్లపట్టాలి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అస్తవ్యస్థంగా ఉన్న డ్రైనేజీ సమస్యను మెరుగుపరచాలని కోరారు. దళితులకు స్మశాన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళగిరి నియోజకవర్గం లో సిపిఎం ప్రజా చైతన్య పాదయాత్రను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎం రవి, సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్, తాడేపల్లి పట్టణ కార్యదర్శి బి వెంకటేశ్వర్లు, దుగ్గిరాల మండలం నాయకులు జె బాలరాజు, సిపిఎం రాజధాని కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై ప్రజా బ్యాలెట్‌లో తీవ్ర వ్యతిరేకత

ప్రజాశక్తి- గుంటూరు

మాట్లాడుతున్న నాయకులు

విద్యుత్ ఛార్జీల భారాలను 95 శాతం ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, వైసిపి ప్రభుత్వం ఈ భారాలను ఉపసంహరించుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని వామపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. మంగళవారం బ్రాడీపేట సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపియం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ నగర కార్యదర్శులు కె.నళినీకాంత్, కోటా మాల్యాద్రి, గనిరాజు మాట్లాడుతూ ఇటీవల వారం రోజులపాటు నగరంలోని ఐదు ప్రాంతాల్లో విద్యుత్ ఛార్జీల పెంపుపై చేపట్టిన ప్రజాబ్యాలెట్ వివరాలను వెల్లడించారు. మొత్తం 1320 మంది ఓట్లు వేయగా విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ 1254 మంది(95శాతం), సమర్థిస్తూ 66 మంది(5శాతం) ఓట్లు వేశారని తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపుతోనే అప్పటి చంద్రబాబు ప్రభుత్వాన్ని 1999 ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారని, ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వం ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో రూ.25 వేల కోట్ల రూపాయల విద్యుత్ భారం ప్రజలపై మోపిందని తెలిపారు. ప్రజలపై భారం మోపే కేంద్ర బిజెపి ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలను ప్రక్క రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నా జగన్ ప్రభుత్వం బలవంతంగా ఇక్కడ అమలు చేస్తున్నదని అన్నారు. రాబోయే కాలంలో స్మార్ట్ మీటర్ల పేరుతో నెలకి రూ.150ల నుండి రూ.200ల అదనపు భారాన్ని ప్రజలపై వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని తెలిపారు. విలేకరుల సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు కె శ్రీనివాసరావు, షేక్ ఖాశిం షహీద్, అరుణ్, మరియదాస్, షేక్ ఖాశిం వలి, ఆది నికల్సన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన కార్మిక శాఖాధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సచివాలయాన్ని సంయుక్త కార్మిక కమిషనర్ శ్రీనివాస్‌కుమార్, ఇతర అధికారులు మంగళ వారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఇ-శ్రమ పోర్టల్‌ను ప్రదర్శించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయకూలీలు, వలస కార్మికులు, రిక్షా తొక్కేవారు, ఇళ్లలో పనిచేసేవారు, మత్స్య కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, చిరువ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారులు, ఇఎస్ఐ/ఇపిఎఫ్ సభ్యత్వం లేనివారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఈ పధ:కంలో చేరటానికి సమీ పంలోని కామన్ సర్వీసు సెంటర్, గ్రామ, వార్డు సచి వాలయాల్లోగానీ, కార్మిక శాఖ కార్యాల యంలో ఆధార్, ఆధార్ లింకు మొబైల్ నంబర్, బ్యాంక్ అకౌంట్‌తో సంప్రదించాలన్నారు. ఇ-శ్రమ నమోదు అవటం వల్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అమల వుతాయని, ప్రమాదవశాత్తూ మరణించినా, పూర్తి అంగవైకల్యం సంభవించినా రూ.రూ.2 లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి రూ.1 లక్ష ఆర్థిక సాయం, తదితర సౌకర్యాలు ఉన్నాయన్నారు. వివరాలకు 7386738503, 8333818740 నంబర్లలో సంప్రదిం చాలన్నారు.

ఎన్నికలకు సమాయత్తం కండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి కోరారు. శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా లేళ్ళ అప్పిరెడ్డి గౌరవార్థం గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బృందా రవీంద్రనాథ్ మంగళవారం తన నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివద్ధి-సంక్షేమ పథకాలను ప్రజలలోకి మరింత విస్తతంగా తీసుకువెళ్లడం.. ప్రభుత్వంపై ప్రతిపక్షాల విషప్రచారాన్ని తిప్పికొట్టడం.. జైలులో ఉన్న అవినీతి పరుల గురించిన వాస్తవాలను ప్రజలకు తెలియ చేయాలన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), గీతామందిరం ఛైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్ పాల్గొన్నారు.

లే అవుట్లకు 15 రోజుల్లో దరఖాస్తులు

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

నగరపాలక సంస్థ పరిధిలో నూతనంగా దరఖాస్తు చేసే లేఅవుట్స్‌కు 15 రోజుల్లో అనుమతులు ఇస్తామని, అనధికార లేఅవుట్స్ తొలగింపునకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు.మంగళవారం కమిషనర్ చాంబర్‌లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షించారు. జిఎంసి పరిధిలో ఎక్కడా అనధికార లేఅవుట్ ఉండకూడదని, ప్రభుత్వ నిర్దేశిత చెక్‌లిస్ట్ మేరకు దరఖాస్తుచేసే లేఅవుట్స్‌కి 15 రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. అదే విధంగా అనధికార లేఅవుట్స్‌ని రానున్న వారం రోజుల్లో తొలగించడానికి, నిర్వాహకులపై చర్యలు తీసుకుంటానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసిన లే అవుట్ అనుమతుల్లో ఎటువంటి జాప్యంగానీ, సమస్యలుగానీ ఉంటే నేరుగా కమిషనర్‌కి ఫిర్యాదు చేయవచ్చన్నారు. లేదా జిఎంసి కాల్ సెంటర్ 0863-2345103గానీ, 9849908381 నంబర్‌కు వాట్సప్ చేస్తే భాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతుల మంజూరు ప్రక్రియ సులభతరం చేసినందున అనధికార లేఅవుట్స్ ఏర్పాటు చేసి సమస్యలకు గురికావద్దని హితవు పలికారు. నగరంలో పెండింగ్ ఉన్న సర్వే దరఖాస్తులను కూడా వేగంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సిటీప్లానర్‌ని ఆదేశించారు. సమావేశంలో సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటి ప్లానర్లు కోటయ్య, మహాపాత్రో, ఏసిపిలు అజయ్ కుమార్ పాల్గొన్నారు

ఎన్నికల విభాగం విధులపై సమీక్ష...

క్షేత్ర స్థాయిలో బిఎల్ఓలు చేసిన ఇంటింటి సర్వేలో సేకరించిన ఫారాలను ఏఈఆర్ఓలు ప్రత్యక్షంగా పరిశీలించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో ఎన్నికల విభాగ విధుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 27కి ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల కానున్నదని, నగరంలోని రెండు నియోజకవర్గాల్లో బిఎల్ఓలు ఇంటింటి సర్వేలో వచ్చిన ఫారాలను ఏఈఆర్ఓలు స్వయంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ (ఇంచార్జి) సిహెచ్.శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కష్ణయ్య, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ మోటారు వెహికిల్ శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు ఎపిఎస్ఆర్‌టిసి గుంటూరు 2 డిపోలో హెవీ మోటార్‌వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్ ప్రారంభించ నున్నట్లు డిపో మేనేజర్ ఎస్.కె.అబ్దుల్ సలామ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకూ 12 బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకొని, 13వ బ్యాచ్ అతి త్వరలో ప్రారంభించబడుతుందన్నారు. కావున ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. సీట్లు పరిమితంగా ఉంటాయని, ఒక్కొక్క బ్యాచ్‌కు 16 మందికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఈ శిక్షణలో ప్రతిరోజు ఒక గంట వాహనం వివిధ భాగాలు, వాటి పనితీరు, వివిధ రకాల రోడ్లు, రోడ్లపైన ఉండే పెయింటింగ్ మార్కులు, రోడ్ల ప్రక్కన ఉండే సైన్ బోర్డులు, సిగ్నల్ బోర్డుల గురించి వివరంగా చెప్పటం జరుగుతుందన్నారు. అలాగే ప్రతిరోజు ప్రాక్టికల్‌గా ప్రతి ఒక్కరితో పదిహేను కిలోమీటర్లు బస్సును నడిపించటం జరుగుతుందన్నారు. గ్యారేజీలో సుదీర్ఘ అనుభవం ఉన్న మెకానిక్‌ల ద్వారా వాహనం విడిభాగాలు, వాటి పనితీరు గురించి సవివరంగా తెలియజేయటం జరుగుతుందన్నారు. ఘాట్ రోడ్‌లో ఎటువంటి భయం లేకుండా నడపటానికి కొండవీడు ఘాట్ రోడ్డులో, కోటప్పకొండ ఘాట్ రోడ్డులో స్వయంగా బస్సు నడిపిస్తామన్నారు. శిక్షణ పూర్తి అయ్యాక ఫారం-5, ఫారం 5ఎ సర్టిఫికెట్స్ జారీ చేస్తామని, తద్వారా అభ్యర్థి ఆర్‌టిఎ నిర్వహించే టెస్ట్‌లో పాల్గొని లైసెన్స్ పొందవచ్చన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 8897371003, 7382894585 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇసిజి సిబ్బంది పనితీరుపై అసంతప్తి

పజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుండె జబ్బుతో బాధ పడే రోగులు ఆసుపత్రి కి వచ్చినప్పుడు ఈ సి జి నిపుణులు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రి లోని ఈసిజి విభాగాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఉదయం ఆసుపత్రి మెడికల్ ఓపి ఇసిజి విభాగాన్ని పరిశీలించగా ఆ సమయంలో కేవలం ఒక ఈసిజి పరికరం మాత్రమే అందుబాటులో ఉండటం పై ఆయన అసంతప్తి వ్యక్తం చేశారు. మరో పరికరాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సాయంత్రం పొదిల ప్రసాద్ బ్లాక్ లోని ఈ సి జి విభాగాన్ని కూడా ఆయన తనిఖీ చేశారు. ఈసిజి నిపుణుల పై రోగుల నుంచి ఫిర్యాదులు వస్తున్న విషయాన్ని వారి దృష్టి కి ఆయన తీసుకుని వెళ్లారు. ఆసుపత్రి లో మొత్తం ఏడుగురు ఈ సి జి నిపుణులు ఉన్నా రోగులకు అందుబాటులో ఉండటం లేదని ఆయన చెప్పారు. కేవలం సెలవుల కోసం మాత్రమే సిబ్బంది పని చేస్తున్నట్లుగా కనపడుతుందని, కొంతమంది ఆసుపత్రి లో పని చేయకుండా బయట పని చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన అన్నారు. ఆసుపత్రి కి సమయానికి రావాలి. ఎన్నిసార్లు బయటకు వెళుతున్నారో సిసి కెమెరాల్లో తెలుస్తోంది. ఒకరి స్థానంలో మరొకరు ఉద్యోగం చేస్తున్నట్లు కూడా ఫిర్యాదులు వస్తున్నాయని ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోవాలన్నారు. రోగులనుండి ఇసిజి తీయలేదని ఆరోపణలు వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సూపరింటెండెంట్ వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని ఉన్నారు.

తెలుగు మహిళల వినూత్న నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై డిప్యూటీ సిఎం నారాయణ స్వామి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మీ ఖండించారు. మంగళ వారం జిల్లా పార్టీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం నారాయణ మాటలను చెత్త బుట్టతో పోల్చి... చెత్త బుట్టలో టీ కప్పులు వేసి, సిఎం జగన్, నారాయణ స్వామి ఫోటోలను చెప్పులతో కొట్టి తమ నిరసన తెలిపారు. విలేకరుల సమావేశం జరిగింది. అన్నాబత్తుని జయలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులను మానసికంగా వైసిపినాయకులు, రాష్ట్రమం త్రులు తమ మాటలతో హింస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకులు షేక్ రిజ్వానా, ఇత్తడి రత్న కుమారి, దాసరి జ్యోతి, శివజ్యోతి పాల్గొన్నారు.

కొనసాగిన ఇవిఎంల మొదటి దశ తనిఖీ

ఇవిఎంల తనిఖీ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వచ్చే ఏడాది నిర్వహించే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అతి ముఖ్యమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఇవిఎం)ల పనితీరు పరిశీలన ప్రక్రియ మొదటిదశ మంగళవారం జరిగింది. ఓటింగ్ పరికరాలైన బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు వివి ప్యాట్ల పనితీరును పరిశీలించేందుకు ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సి) ప్రక్రియ మంగళవారం మొదలైంది. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని వినుకొండ రోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో భద్రపరిచిన ఇవిఎంల తనిఖీని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌తో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేశారు. నరసరావుపేట పార్లమెంట్‌తో పాటు నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, సత్తెనపల్లి, పెదకూరపాడు, గురజాల, మాచర్ల నియోజకవర్గాలకు సంబంధించి ఓటింగ్ పరికరాల పనితీరు వాటి నిర్వహణ ఇతర సౌకర్యాలు కల్పన కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఈ విధానాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. మొదట బ్యాలెట్ యూనిట్లలో ఓటు వేయడం జరుగుతుందని అది కంట్రోల్ యూనిట్‌లో నిక్షిప్తం అవుతుందని, అదే సమయంలో ఓటు ఎవరికి వేసింది కనిపించేలా ఎఫ్ఎల్‌సి ప్రక్రియ కొనసాగుతుందని, ఎక్కడ తేడా వచ్చినా అందుకు సంబంధించి కారణాలు ఇతర ప్రక్రియలు చేపడతారని వివరించారు. ఎఫ్ఎల్‌సి ప్రక్రియ పకడ్బందీగా చేపట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. గోడౌన్‌లోకి సెల్‌ఫోన్‌లు, కెమెరాలను అనుమతించొద్దని, ఒక పేపర్ కూడా బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ ప్రక్రియలో పాల్గొనే అధికారులకు గుర్తింపు కార్డు మంజూరు చేసిన వారినే అనుమతివ్వాలని ఆదేశించారు. ఇవిఎంలను సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా అక్కడ ఏర్పాటు చేస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను, సెల్‌ఫోన్‌ను భద్రపరిచే గదిని పరిశీలించారు. కార్యక్రమంలో గోడౌన్ ఇంఛార్జ్ అయిన డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, తహశీల్దార్ రమణ నాయక్ పాల్గొన్నారు.

ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రి రాంబాబు

350 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - నకరికల్లు

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షకు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని నరసింగపాడులో మంగళవారం నిర్వహించిన శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఇంటి వద్దకే తమ ప్రభుత్వం తెచ్చిందని, క్లిష్టమైన సమస్యలున్న వారికి కార్పొరేట్ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా వైద్యం అందిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిబిరంలో 350 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జెడ్‌పిటిసి హరీష్, జెసిఎస్ మండల కన్వీనర్ ఎం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపిడిఒ బి.శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ శ్రీనునాయక్, సర్పంచ్ ఎస్.రామకోటమ్మ పాల్గొన్నారు.



ధ్రువపత్రం అందుకుంటున్న భయ్యన్న

వడ్డెర సంఘం కన్వీనర్‌గా భయ్యన్న

ప్రజాశక్తి - దాచేపల్లి

వడ్డెర సంఘం నియోజకవర్గ కన్వీనర్‌గా బత్తుల భయ్యన్న, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు తమ్మిశెట్టి రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం నాయకులు చంద్రగిరి ఏసురత్నం, వడియారాజుల సంఘం జాతీయ అధ్యక్షులు, శ్రీశైలం దేవస్థానం బోర్డు మెంబెర్ తన్నీరు ధర్మరాజు పర్యవేక్షణలో వీరిని ఎన్నుకున్నారు. వీరికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఇబ్బందులు తెచ్చే విగ్రహాన్ని తొలగించాలి

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని మార్కాపురం రోడ్డు చెక్‌పోస్ట్ సెంటర్లో అనధికారికంగా రాత్రికి రాత్రే ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. నాయకులు కె.నాగశ్రీను మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉందని, ఇప్పుడు విగ్రహాన్ని రోడ్డు మధ్యలో ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులు మరింత ఇబ్బంది పడతారని చెప్పారు. విగ్రహానికి సమీపంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వైపు నుంచి వచ్చే పెద్ద వాహనాలు మలుపు తిరగడానికి చాలా కష్టంగా ఉంటుందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కె.కిషోర్, ఎ.కుమార్, రజిబాబు, జి.మణికంఠ, యూసఫ్ ఉన్నారు.

పైర్లు ఎండిపోతున్నా పట్టించుకోని సిఎం

ప్రభుత్వంపై మాజీ మంత్రులు పుల్లారావు, లక్ష్మీనారాయణ విమర్శలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వర్షాల్లేక, కాల్వల్లో నీరు పారక, బోర్లు పనిచేయక పైర్లన్నీ కళ్లముందే ఎండిపోతున్నాయని, అయినా రైతుల గోడును ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పట్టించుకోవడం లేదని మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఒకవైపు కృష్ణా పరివాహక ప్రాంతంలో చుక్కనీరు లేదని, మరోవైపు ఎడాపెడా విద్యుత్ కోతలతో రైతులు అల్లాడిపోతున్నారని అన్నారు. పంటలు చేతికి వచ్చే సమయంలో ఎండిపోతున్న పైర్లను చూసి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కనీసం కరువు మండలాలనైనా ప్రకటించకుండా రైతుల జీవితాలతో ఆటలాడుతోందని మండిపడ్డారు. కరెంటు కోతలకు తాళలేక విద్యుత్ ఉపకేంద్రాలను ముట్టడిస్తున్న రైతులకు సమధానం చెప్పలేక పోతున్నారని అన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు, రాయలసీమ ప్రాంతంలో మరీ దయనీయమైన పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. ప్రభుత్వ ప్రణాళిక లోపం కారణంగా సరిపడా సాగునీరు లేక కృష్ణా డెల్టాలో పరిస్థితి మరింద ఆందోళనకరంగా ఉంద న్నారు. ఆరుతడి పంటలకైనా నీరు విడుదల చేస్తారో లేదో ప్రభుత్వం స్పష్టం చేయాలని పుల్లారావు డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రైతులు సాగునీటి కోసం అష్టకష్టాలు పడుతుండే వారి గోడు పట్టించుకోకుండా ప్రతిపక్ష నాయకులపై కేసులు ఎలా పెట్టాలా? అని సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆలోచిస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు సాగునీరు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, కరువు మండలాలను ప్రకటించాల్సిన ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదని అన్నారు. సాగునీటి విషయంలో రాష్ట్ర రైతులను తెలంగాణకు ఏపీ ప్రభుత్వం పణంగా పెట్టిందని విమర్శించారు. పార్టీ మారిన నాయకులపై మంత్రి అంబటి రాంబాబు అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వీటికి నిరసనగా త్వరలో ధర్నా చేస్తానని చెప్పారు.

శిలాఫలకానికే పరిమితమైన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణం

ప్రజాశక్తి - అమరావతి

మండంలోని వైకుంఠపురంలో బ్యారేజి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం అలంకారప్రాయంగానే ఉందని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంట గోపి విమర్శించారు. ఈ మేరకు మంగళవారం శిలాఫలకం వద్దకు నిరసన తెలిపారు. 2019 ఫిబ్రవరిలో రూ.2160 కోట్ల అంచనాలతో చేపట్టిన పనులు శంకుస్థాపన దశలోనే నిలిచాయన్నారు. రెండు జిల్లాలు కలిపే ఈ బ్రిడ్జి ద్వారా హైదరాబాద్ వెళ్లేందుకు సులువుగా ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు పది టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చని, ఎత్తిపోతల పథకాలకు నీరు పుష్కలంగా లభిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బ్యారేజ్ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కె.సురేంద్ర, నాగరాజు, ఎం.ఉదయశంకర్, బి.గోపి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రోజురోజుకూ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సిగ్నల్, లైట్లను త్వరగా ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా రాష్ట్ర ఎగ్జిక్యూ టివ్ కమిటీ మెంబర్ ఎం.భానుప్రసాద్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ గోవిందరాజులను మంగళవారం కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. విజయ బ్యాంక్ సెంటర్లో వేసిన స్పీడ్ బ్రేకర్ కారణంగా ఓ మహిళ, మోటార్ సైకిల్‌పై వెళుతూ వెనకకు పడి మృతి చెందారని, స్పీడ్ బ్రేకర్‌ను మధ్యలో కాకుండా క్రింది భాగంలో ఏర్పాటు చేయాలని కోరారు. జాతీయ రహదారిపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు.

అలెగ్జాండర్ సుధాకర్ నియామకంపై హర్షం

అలెగ్జాండర్ సుధాకర్‌ను సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులుగా గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ రెండోసారి నియమితులైనందుకు గాను ఆ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చక్క చంద్రపాల్, పిసిసి కార్యదర్శి ఎం.వేదాద్రి, పట్టణ అధ్యక్షులు దాసరి జ్ఞానరాజ్‌పాల్ మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం పనిచేస్తున్న వారికి పిసిసి అధ్యక్షులు రుద్రరాజు న్యాయం చేశారని అన్నారు. అలెగ్జాండర్ మీద పూర్తి నమ్మకం ఉందని, అందర్నీ కలుపుకొని పార్టీని జిల్లాలో అభివృద్ధి చేస్తారని చెప్పారు. అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ అఖిల భారత అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేతోపాటు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, రుద్రరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. పిసిసిలో ఎం.రాధాకృష్ణ, సూర్య నాయక్‌కు స్థానం కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముప్పాళ్ల మండల అధ్యక్షులు కె.ఆనంద్, నరసరావుపేట పట్టణ అధ్యక్షులు ఎస్ఎం బాష, కృష్ణ, జె.శేఖర్, సుభాని, అమీర్ పాల్గొన్నారు.

రైతులకు నష్టం లేకుండా సాగునీరు విడుదల

కెడబ్ల్యాడి, గుంటూర్ ఛానల్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

రైతులకు పంట నష్టం జరుగకుండా ఉన్న నీటి వనరులను రైతులకు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళ వారం జిల్లాలోని కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో వున్న సాగునీటి కాలువలు, గుంటూరు ఛానెల్ పరిధిలోని కాలువలను కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మ, జల వనరుల శాఖ అధికారులతో కలసి తనిఖీ చేశారు. తొలుత కృష్ణాపశ్చిమ డెల్టా ప్రారంభ స్థానమైన సీతానగరం కృష్ణాపశ్చిమ మెయిన్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్, గుంటూరు ఛానెల్ ప్రారంభ స్థానం రెగ్యులేటర్, పెద్దవడ్లపూడి వద్ద వున్న హైలెవెల్ కాలువ ఆఫ్‌టేక్ స్లుయిస్, నిర్మాణంలో వున్న ఏ.పి.ఎస్.ఐ.డి.సి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని తదుపరి హై లెవెల్ కాలువలో భాగమైన ఈస్ట్ వెస్ట్ కాలువలు, రేవేంద్రపాడు లాకులు, కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్, దుగ్గిరాల లాకులు, కృష్ణా పశ్చిమడెల్టా పరిధిలోని హైలెవెల్, ఈస్ట్ వెస్ట్, నిజాంపట్నం కాలువలు, కొమ్మమూరి కాలువలు, జాగర్లమూడి లాకులు తనిఖీచేసి జనవనరుల శాఖ అధికారులకు తగు సూచనలు చేశారు. నీటి వనరులు తక్కువగా అందుబాటులో ఉన్న నేపథ్యంలో రైతులకు పంట నష్టం జరుగకుండా ఉండేందుకు అదనపు నీటి సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళగా, పులిచింతల ప్రాజెక్టు నుండి విడుదల చేస్తున్న ఐదు వేల క్యూసెక్కుల నీటితో పాటు, అదనంగా మరో వెయ్యి క్యూసెక్కుల నీటిని డ్రా చేసుకోవడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏ ఒక్క రైతుకు కూడా సాగునీరు అందక పైరు ఎండి పోకూడదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆపరేషనల్, మెయింటెనెన్స్ పనులు, తూటికాడ తొలగింపు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు మేలు చేసేందుకు అదనపు యంత్రాలను వినియోగించాలని కలెక్టర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని గుంటూరు జిల్లాలో 1,84,000 ఎకరాలు, గుంటూరు చానెల్ పరిధిలోని 27,000 ఎకరాలు, ఇతర మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్న ఆయకట్టు అంతటికీ ఒక క్రమ పద్ధతి, ప్రణాళిక ప్రకారం సాగు నీరు విడుదల చేసి, రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. పరిశీలనలో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండల తహశీల్దార్లు రాంప్రసాద్, నాగిరెడ్డి, మల్లేశ్వరి జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఉమామహేశ్వరరావు, కృష్ణా పశ్చిమ విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ మల్లిఖార్జున, గుంటూరు డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎన్.వి.కే.ప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ వి.కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

కాల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు

దసరా సెలవుల దృష్ట్యా అదనపు బస్సులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి డిపోలో బుధ వారం జిల్లా ప్రాంతీయ అధికారి పి రవికాంత్ తనిఖీలు నిర్వహించారు. మెకానిక్ షెడ్డుల నిర్వ హణ, సిబ్బంది వృత్తి నైపుణ్యతను పరిశీలిం చారు. అనంతరం డిపో ఆవరణలో ఆర్టీసీ సిబ్బందితో గేట్ మీటింగ్ ఏర్పాటు చేసి లక్ష్యం సాధించిన ముగ్గురు కండక్టర్లకు పారితోషకాన్ని అందించారు. కార్యక్రమంలో సిబ్బందిని ఉద్దేశించి డిఎం మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి తన ఉద్యోగ బాధ్యతను సక్రమంగా నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. తెనాలి జోన్ పరిధిలో తెనాలి డిపో ప్రధమ స్థానంలో నిలిచిందన్నారు. సమిష్టి కృషితో డిపో అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. వ్యక్తిగత ఆరోగ్య పరీక్షలు నిర్వహణలో అలసత్వం వహించొద్దని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఖాతాదారులు ఎస్‌బిఐ రూపే కార్డును కలిగిఉండాలని అన్నారు. దసరా సెలవులు దృష్ట్యా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలియజేసారు.

మాట్లాడుతున్న ఆర్టీసీప్రాంతీయ అధికారి

త్వరలో చేనేత భవన్ ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి :పాత బస్టాండ్ సెంటర్లో రూ.5 కోట్లతో నిర్మాణం జరుగు తున్న చేనేత భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 95శాతం పనులు పూర్తయ్యాయని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. చేనేత క్రయ, విక్రయాలకు వేదికగా ఈ భవనం ఉంటుందని, ఐదు అంతస్తుల్లో 40 షాపులు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. చేనేత నాయకులు ప్రగడ కోటయ్య, చేనేత బాంధవులు వైయస్ రాజశేఖర్ రెడ్డి పేర్లతో ఈ భవనం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర చేనేత వైసీపీ భాగం అధ్యక్షులు గంజి చిరంజీవి, కార్పొరేషన్ కమిషనర్ యు శారదా దేవి, వివిధ శాఖల చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు విగ్రహం పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి : టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహ పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే మురుగుడు హనుమంతరావు పశ్చిమ డెల్టా హెడ్ రెగ్యులేటర్ సమీపంలో ఎంటిఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రకాశం పంతులు విగ్రహం పనులు పూర్తి కావచ్చాయి. మూడు రోడ్ల జంక్షన్‌లో గార్డినింగ్ పనులు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంటిఎంసి కమిషనర్ యు.శారదాదేవి, గంజి చిరంజీవి, ఇ.డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నివాస గృహాల్లోకి మురుగు నీరు

డ్రెయినేజీని పార్కింగ్ కోసం షాపుల వాళ్లు మూసేశారు

సమస్య పరిష్కరించాలని అధికారులకు స్థానికుల వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

షాపుల యజమానులు డ్రైనేజీ పైన పార్కింగ్ ప్లేస్‌గా ఉపయోగించడానికి మూసివేయడంతో దాని కింద మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారు. వాహనాల పార్కింగ్ కోసం డ్రైనేజీని మూసివేయడంతో కాలువ పూడికతో నిండి నిండిపోయి మురుగు పారుదల లేక మురుగునీరు ఇంటిలోకి వచ్చి దోమలు, దుర్గంధంతో ఉండలేకపోతున్నామని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

మంగళగిరి 13వ వార్డు ముస్లిం బరియల్ గ్రౌండ్ వద్ద తెనాలి రోడ్డులో దక్షిణం వైపు ఉన్న డ్రైనేజీ పెద్దదిగా ఉండేది. అయితే గతంలో తెనాలి రోడ్డు తారు రోడ్డు నుంచి సిమెంట్ రోడ్డుగా మార్చే క్రమంలో రోడ్డు కాస్త విస్తరించడంతో డ్రైనేజీ కుదించుకుపోయింది. దాంతో మురుగు పారుదల అంతంత మాత్రంగా ఉంటుంది. అయితే షాపుల యజమానులు వాహనాల పార్కింగ్ కోసం డ్రైనేజీ పై సిమెంట్ కాంక్రీటు, సిమెంట్ బల్లలు, నాపరాళ్ళతో మూసివేయడంతో డ్రైనేజీలో పూడిక పెరిగి మురుగు పారుదల నిలిచిపోయింది. దీంతో మురుగు నీరు నివాస గహాల్లోకి వస్తుంది. దోమల వద్ధి చెంది దుర్గంధం వెదజల్లుతూ అంటూ వ్యాధులకు గురి అయ్యే ప్రమాదం ఉందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షాపుల యజమానులు డ్రైనేజీలను సిమ్మెంటు బల్లలు సిమెంట్ కాంక్రీట్‌లతో మూసివేసి పేరుకు మాత్రం పూడిక తీయడానికి ఉపయోగం లేని మాన్యువల్స్ పెట్టి కార్పొరేషన్ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. తమ సమస్యను కార్పొరేషన్ అధికారులు దష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుకు న్యాయవాదుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి -మంగళగిరి

శాసనమండలి ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావును మంగళగిరి సీనియర్ న్యాయ వాది వాకా రామ గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం పలు వురు న్యాయవాదులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. కార్య క్రమంలో న్యాయవాదులు యస్. బాల మురళి కష్ణ, ఎండి షౌకత్ హుస్సేన్, వంగర కిషోర్, యం. సురేంద్ర బాబు, కొటేశ్వరి, భారతి దేవి, తాతా సాంబశివరావు, చిరంజీవి పాల్గొన్నారు.

ఆచార్య నాగార్జున వర్సిటీ డిగ్రీ ఫలితాల్లో

పిఎఎన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

ఎఎన్‌యు డిగ్రీ ఫలితాల్లో పెదనందిపాడు పిఎఎన్ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ జి వీరరాఘవయ్య మంగళవారం తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో పెదనందిపాడు పిఎఎన్ కళాశాల బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్‌లో 93శాతం, బికాంలో 77శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. బి.ఎస్సిలో సరిమల కోటేశ్వర రావు717 మార్కులతో 84శాతం, బికాంలో మల్తె అమృత 453 మార్కులతో 82శాతం సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

బాల్యవివాహాల నిర్మూలనపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రభుత్వం పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఎన్జీజీవో కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. తెనాలి సిడిపిఒ డాక్టర్ ఎం సునీత ఆధ్వర్యంలో ఆంద్రప్రదేశ్ ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ రూల్స్ 2023, అండర్ చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ యాక్ట్-2006 అనే అంశంపై మహిళా పోలీసులకు శిక్షణ నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధక చట్టంలో మహిళా సంరక్షణ, కార్యదర్శులు పాటించాల్సిన అంశాలను అధికారులు వివరించారు. ఎపి బాలల హక్కుల కమిషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 39 విడుదల చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు జిల్లాలో బాల్యవివాహాలు నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలకు 18, పురుషుల్లో 21 సంవత్సరాలు నిండని వారికి వివాహాలు జరిగితే శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతాయని సూచించారు. గణాంకాలు ప్రకారం 18 ఏళ్ల లోపు చదువుకుంటున్న బాలికల్లో 70 శాతం రక్తహీనత ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. రక్తహీనత నివారణకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ఒక ఇండికేటర్ క్రోడీకరింపబడి బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం కృషిచేస్తుందని పేర్కొన్నారు. ఎపిపి ఎ సునీల్ కుమార్ మాట్లాడుతూ చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో బాల్యవివాహాలపై ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు ప్రోత్సహించిన వారికి లక్ష రూపాయల జరి మానాతో పాటు జైలు తప్పదన్నారు. తమ పిల్లల ఆరోగ్య భద్రత దృష్ట్యా మైనార్టీ తీరిన వారికి మాత్రమే వివాహాలు జరిపించాలని సూచించారు. చైల్డ్ కేర్ అడ్వకేసి ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి, స్టేట్ కోఆర్డినేటర్ జీ తిరుపతిరావు, ఇంచార్జి డిసిపిఓ పి దుర్గాభవాని, లీగల్ అధికారి బి వాసంతి, ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కే సమీర్ కుమార్ తదితరులు బాల్యవివాహాలపై మాట్లాడారు.

మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్

26న వైసిపి బస్సు యాత్ర

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నియోజక వర్గ పరిధిలో అక్టోబర్ 26న నిర్వహించనున్న వైసిపి బస్సుయాత్రను విజయవంతం చేయాలని తెనాలి శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం తెనాలి మండల ఇంచార్జి ఎంపిపి గా గోపిశెట్టి రమాదేవి కు పదవీబాధ్యతలు అప్పగించారు. రెండున్నర సంవత్సరాలు ఎంపిపి పదవిలో కొనసాగిన చెన్నుబోయిన శ్రీనివాసరావు, తన పదవికి అక్టోబర్ 4న రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన రమాదేవికు ఎంపిటిసి చెన్నకేశవులు, శ్రీనివాసరావు, పిల్లి ఉమాప్రణతి, నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసిస్ట్ 1, ల్యాబ్ టెక్నీషియన్ 1, రేడియోగ్రాఫర్ 1, థియేటర్ అసిస్టెంట్ 2, జనరల్ డిప్యూటీ అటెండెంట్ 7, పోస్ట్‌మార్టమ్ అసిస్టెంట్ 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. దరఖాస్తు ఫారంతో పాటు, జత చేయాల్సిన ధృవపత్రాల వివరాలు http// guntur.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను రిజిస్టర్ పోస్ట్ అక్నాలెడ్జిమెంట్ చేసి, డిఎంఅండ్‌చ్ఒ కార్యాలయ ప్రాంగణంలోని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్రాప్‌బాక్స్‌లో వేయాలన్నారు. దరఖాస్తులు ఈనెల 24న సాయంత్రం 5 గంటల వరకే స్వీకరించబడతాయన్నారు.

కార్పొరేట్‌స్థాయిలో ఒపి కేంద్రాలు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి పొదిల ప్రసాద్ బ్లాక్‌లో ఒపి కేంద్రాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దినట్లు సూపరిం టెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఓపి కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అత్యవసర చికిత్స విభాగానికి ప్రతి రోజు 700 నుంచి 800 మంది రోగులు వస్తున్నారని చెప్పారు. ఆక్సిజన్, వెంటిలేటర్‌లతో చావుబ్రతుకుల మధ్య వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు వెంటనే రిజిస్ట్రేషన్ జరిగే విధంగా ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. ఈ విభాగంలో నాలుగు ఓపి కేంద్రాలను ప్రారంభించామని అందులో ఒక కౌంటర్ ను ఆరోగ్య శ్రీ కోసం ప్రత్యేకంగా కేటాయించామని ఆయన తెలిపారు. గతంలో ఇదే ప్రాంతం ఇరుకుగా ఉండేది. ఒకరిపై మరొకరు పడి పోయే పరిస్థితి కనిపించింది. ఈ సమస్యలను గుర్తించి నూతన కౌంటర్ లను అందుబాటులో తీసుకుని వచ్చినట్లు ఆయన చెప్పారు. దానికి తోడు రానున్న రోజుల్లో మరో అయిదు ఛాంబర్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. రోగుల సౌకర్యార్థం ఒపి రిజిస్ట్రేషన్ లను కార్పొరేట్ స్థాయికి తగ్గట్టుగా తయారు చేసినట్లు ఆయన చెప్పారు.

వినూత్న ఆలోచనలే పెట్టుబడి

ఆర్‌విఆర్ వర్క్‌షాప్‌లో ప్రాగ్మాటిక్ ఫౌండర్ భరత్ గుజవర్తి

ప్రజాశక్తి-గుంటూరు

అంకుర పరిశ్రమల స్థాపనలో వినూత్న ఆలోచనలే ప్రధాన పెట్టుబడి అని హైదరా బాద్‌కు చెందిన ప్రాగ్మాటిక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఫౌండర్, సిఇఒ భరత్ గుజవర్తి పేర్కొన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో మంగళవారం 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్-యాజ్ కెరీర్ ఆపర్చ్యునిటీ' అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అంకుర పరిశ్రమల స్థాపనకు, వాటిని అంతర్జాతీయ దిశగా విజయపథంలో తీసుకెళ్లటానికి అనుసరించాల్సిన అంశాల గురించి వివరించారు. సాంకేతిక వ్యాపార రంగంలో విభిన్న ఆలోచనలతో జొమాటో, పేటిఎం, ఫ్లిప్‌కార్ట్ వంటి అనేక వ్యాపార సంస్థలు విజయపథంలో దూసుకెళుతున్నాయని చెప్పారు. భారతదేశం ప్రస్తుతం యునైటెడ్ స్టేట్స్, చైనా తర్వాత ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ హబ్‌గా ర్యాంక్ పొందిందని తెలిపారు.టెక్నాలజీ రంగంలో 6జి దిశగా టెరాబైట్ ఇంటర్నెట్ వేగం పుంచుకుందని, సాంకేతిక వ్యాపార రంగంలో డేటా సేకరణ అధిక ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. ఉద్యోగాలు ఆశించే స్థాయి నుండి ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరే విధంగా విద్యార్థుల ఆలోచనలు ఉండాలని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో చిత్రకళా ప్రదర్శన

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వ విద్యా లయం, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాల, ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో తృతీయ సంవత్సర విద్యార్థుల సెమిస్టర్ ముగింపు చిత్రకళా ప్రదర్శన మంగళవారం కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఈ ప్రదర్శనను విశ్వవిద్యాలయ ఉపకుల పతి ఆచార్య పి. రాజశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ అండ్ కల్చరల్ సీఈవో ఆర్. మల్లికార్జున రావు, ప్రిన్సిపల్ ఆచార్య ఈదర శ్రీనివాస రెడ్డి, స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఫైన్ ఆర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ జి అనిత, సి డి ఇ డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, ఇంజనీర్ డి ఎ. కుమార్ రాజు ఈ ప్రదర్శనను సందర్శించి విద్యార్థులకు అభినందించారు. ఈ ప్రదర్శనలో ఉన్న చిత్రాలను గురించి అధ్యాపకులైన బి. జాన్ రత్నం బాబు వివరించారు. ఈ ప్రదర్శనలో దాదాపు 100 చిత్రాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన 17, 18 తేదీలలో జరుగుతుందని నిర్వహకులు తెలిపారు.

ఒపిఎస్ సాధనకు రేపటి నుండి నిరవధిక దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పాత పెన్షన్ విధానం సాధనకు ఈనెల 19 నుండి జిల్లా కేంద్రంలో నిరవధిక దీక్ష చేపడుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ తెలిపారు. మంగళవారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో దీక్షల పోస్టర్‌ను యుటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన జిపిఎస్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. హామీ ఇవ్వని రాష్ట్రాలు కూడా సిపిఎస్ విధానం రద్దు చేసి, ఓపిఎస్ అమలుకు నిర్ణయం తీసుకుంటున్నాయని, కానీ ఓపిఎస్ ఇస్తామని మామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మాట తప్పిందన్నారు.అధికారం చేపట్టిన నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు జిపిఎస్‌ను తెరపైకి తెచ్చిందన్నారు. సిపిఎస్‌కు, సిపిఎస్‌కు తేడా లేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్థాయిలో ఈనెల 18 నుండి, జిల్లా స్థాయిలో 19వ తేదీ నుండి నిరవధిక దీక్షలు ప్రారంభం అవుతున్నాయని చెప్పారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు పి.వి.శ్రీనివాసరావు, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఎ.ఎల్. శివపార్వతి, కోశాధికారి ఎండి.దౌలా, సిపిఎస్ కన్వీనర్ సిహెచ్.ఆదినారాయణ, కో కన్వీనర్ ఎండి.షకీలా బేగం తదితరులు పాల్గొన్నారు.

వినుకొండకు వంద పడకల ఆసుపత్రి

8500 కోట్లతో 17 మెడికల్ కాలేజీలు

- మంత్రి విడుదల రజని

ప్రజాశక్తి - వినుకొండ

వైసిపి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.8500 కోట్లు ఖర్చు చేసి 17 మెడికల్ కాలేజీలు తీసుకురావడం జరుగుతుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడుదల రజిని తెలిపారు. వినుకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యవసర సేవల విభాగం భవనాన్ని మంగళవారం మంత్రి రజిని ప్రారంభించారు. అనంతరం డి.సి.హెచ్ రంగారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ పల్నాడు జిల్లా పిడుగురాళ్ల ప్రాంతంలో మెడికల్ కాలేజీ రాబోతుందని అందుకు రూ.500 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. వినుకొండలో వంద పడకల ఆసుపత్రి త్వరలో నిర్మాణం చేపట్టి, ట్రామా కేర్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటింటికి వైద్య సేవలు అందించే బహత్తర కార్యక్రమం చేపట్టి సీఎం జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు నేరుగా ఇంటి వద్దకే వైద్య సదుపాయాలు అందిస్తున్నారని అన్నారు. విలేజ్ క్లినిక్‌ల ద్వారా వైద్యం అందుబాటులోకి తెచ్చి నెలలో రెండుసార్లు డాక్టర్లు ఇంటికి వచ్చి పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. వినుకొండ సిహెచ్‌సిలో రూ.2.10 కోట్లతో క్యాజువాలిటీ బ్లాక్ నిర్మాణం చేపట్టామని, అలాగే ఈపూరు సిహెచ్సిలో రూ.6 కోట్లతో నూతన భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుంటే ప్రతిపక్షాలు విమర్శించడం తగదన్నారు. గతంలో 1059 సేవలు ఉంటే, సీఎం జగన్మోహన్ రెడ్డి 3257 సేవలు పెంచి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందిస్తూ ప్రజలను ఆదుకుంటున్నారని అన్నారు. వినుకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో 8 మంది వైద్యులు, 35 మంది వైద్య సిబ్బంది ఉన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్లలో వినుకొండ నియోజకవర్గంలో 70 శాతం అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. తాగునీరు, ఘాట్ రోడ్డు, గుడి, షాపింగ్ కాంప్లెక్స్ , బ్రిడ్జిలు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. మంత్రి విడదల రజిని సహకారంతో వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రిని మరింతగా అభివృద్ధి చేసుకోవడం జరిగిందని వివరించారు. మాజీ ఎమ్మెల్యే మక్కిన మల్లికార్జునరావు మాట్లాడుతూ దివంగత నేత వైయస్సార్ హయాంలో వినుకొండ ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ సేవా కేంద్రం ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. పల్నాడు జిల్లా జెసి శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ వినుకొండ పట్టణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి త్వరలో అనుమతులు రానున్నాయని, రూ.45 కోట్లు నాబార్డ్ నిధులతో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో 17వేల చుక్కల భూములు, అసైన్డ్ భూములకు హక్కులు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రజాక్, వైద్యులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ సామ్రాజ్యం, సభ్యులు కొత్త మాసు శివ, గౌస్ బాషా, పిఎస్ కాన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నబ్బాయి, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

చీడపీడల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రబీ సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు శాస్త్రవేత్తలు, అధికారులతో లాంలోని ఆచార్య ఎన్‌జిరంగా విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉప కులపతి ఆర్.శారదా జయలక్ష్మి సన్నాహక సమావేశం నిర్వహించారు. విస్తరణ సంచాలకులు ఎ.సుబ్బరామిరెడ్డి అధ్యక్షత వహించారు. జయలక్ష్మి ప్రసంగిస్తూ ఉష్ణోగ్రతల్లో తేడాలు, అకాల వర్షాల వల్ల చీడపీడల ఉధృతికి అవకాశం ఉందన్నారు. శాస్త్రవేత్తలు రైతులకు తగిన సూచనలు చేయాలన్నారు. ఈ మేరకు ఖచ్చితమైన సాంకేతిక సలహాలను రూపొందించి వ్యవసాయ శాఖ అధికారులకు,ఆర్‌బికే సిబ్బందికి అందివ్వాలని కోరారు. విస్తరణ విభాగం డైరక్టర్ ఎల్. ప్రశాంతి మాట్లాడుతూ విస్తరణ శాస్త్రవేత్తలు రైతులతో కలసి పొలాల్లో పైర్లను పరిశీలించాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం అధికారులు, వాతావరణ పరిస్థితులు, వివిధపంటల్లో గమనించాల్సిన సమస్యలపై చర్చించారు. సమావేశంలో భారత వ్యవసాయపరిశోధన మండలి ప్రధాన శాస్త్రవేత్తలైన డాక్టర్ ఎస్.వి.సాయి ప్రసాద్, వివిధ విభాగాల శాస్త్రవేత్తలు సంజనారెడ్డి, టి.భూపతి, బాలూ నాయక్, వ్యవసాయశాఖ జాయింట్ డైరక్టర్ కృపాదాస్, డిప్యూటీ డైరక్టర్ బాలూనాయక్ పాల్గొన్నారు.

వృద్ధురాలి చిన్నపేగులో కణితి తొలగింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు 80 ఏళ్ళ వృద్ధురాలి చిన్న పేగులో గడ్డను కోత కుట్టు లేకుండా అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. సూపరింటెం డెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఇందుకు సంబంధించిన వివరాలను తెలిపారు. గుంటూరు నగరంలోని కోబాల్డ్ పేటకు చెందిన షేక్ హబిబున్నీసా (80) ఈ నెల 10 వ తేదీన గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపికి పచ్చ కామెర్లు, కడుపునొప్పి బాధతో వచ్చారు. ఈ విభాగం ప్రొఫెసర్ కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగూర్ బాషాలు పరీక్షించి చిన్న పేగులో బాధితు రాలికి క్యాన్సర్ తుది దశలో ఉందని గుర్తించారని ఆయన చెప్పారు. దీనికి ఎండోస్కోపిక్ అంపులెక్టమీ చేయాలని వైద్యులు నిర్ణయించి ఈ నెల 14 వ తేదీన ఎండో స్కోపి ద్వారా డాక్టర్ కవిత, డాక్టర్ నాగూర్ బాషా సర్జరీ చేశారని, బాధితురాలిని అదే రోజున డిశ్చార్జ్ చేసినట్లు తుది దశలో క్యాన్సర్ గడ్డను ఎండో స్కోపి ద్వారా తీసి పెద్ద సర్జరీ నుంచి కాపాడినట్లు ఆయన చెప్పారు. ప్రాణాప్రాయం నుంచి రోగిని కాపాడిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను ఆయన అభినందించారు. ఆపరేషన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివ రామకృష్ణ, డాక్టర్ అనిల్ కుమార్, పీజీ వైద్యులు, మత్తు వైద్యులు డాక్టర్ పోలయ్య, డాక్టరు శివరాం, డాక్టర్ విష్ణు మహేష్ పాల్గొన్నారు.